# లావణ్యాలాలస

మత్తి భానుమూర్తి

చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి లావణ్యకి

రేపల్లె
24-1-89

నీ తండ్రి దశరథరామయ్య ఆశీర్వదించి వ్రాయునది. ఇక్కడ మేమంతా క్షేమము. నువ్వు సంక్రాంతికి వచ్చి వెళ్ళాక ఇంతవరకూ ఉత్తరం రాయలేదని మీ అమ్మ కంగారుపడుతోంది. ఓ ముఖ్య విషయం తల్లి. నువ్వు అదృష్ట దేవతవు అని మీ అమ్మ ఎప్పుడూ అంటుండే మాట నిజం కాబోతోంది.

ఆడపిల్ల పుట్టడమే యావజ్జీవ శిక్షంటే ఎక్కువగా బాధపడే ఈ రోజుల్లో నాకంటే గొప్ప వాడెవ్వరూ వుండరు. ఓ కోటీశ్వరుడు తన కొడుక్కి నిన్ను భార్యగా అడగడానికి మనింటికి వచ్చాడంటే గొప్ప కదూ ... మన ఊరి పక్కనే వున్న రావులపాలెం ప్రెసిడెంట్‌గారు, నూట యాభై ఎకరాల ఆసామి అయిన శేషాచలం గారు నిన్న మనింటికొచ్చారు. ఆయన పెద్ద కొడుకు నిన్ను చూసి పెళ్ళి చేసుకొనే అభిప్రాయం కలిగినట్లు ఆయనతో చెప్పారట ... నా అభిప్రాయం అడగడానికి వచ్చారు. మాటలు రాక మూగవాడినై పోయాను. ఓ ముఖ్య విషయం శేషాచలం గారబ్బాయి వైజాగులోనే డాక్టరుగిరి చదువుతున్నాడట. నిన్ను కలవడానికి రావచ్చు... జాగ్రత్త. అర్థం చేసుకొని మసలుకోగలవు. ఉత్తరం రాయడం ఆలస్యం చెయ్యవద్దు. వదిన నీకు రెండు చీరెలు తీసుకున్న విషయం రాయమంది. వుంటాను ... జాగ్రత్త!!

ఇట్లు
దశరథరామయ్య వ్రాలు

ఉత్తరం మొత్తం పూర్తయ్యేసరికి లావణ్యకు సంభ్రమాశ్చర్యాలతో చెమట పట్టింది. ఉత్తేజ ఉద్వేగాల ప్రభావంతో అలసిపోయినట్లు విశ్రాంతిగా మంచంపై చతికిలబడింది.

ఊహాతీతమైన వార్త కలిగించిన థ్రిల్ కాస్త తగ్గాక ఆనందంతో కూడిన కంగారు ఆమెను ఆవేశించింది.


ఎమ్మే చదువుతూ హాస్టల్లో వుంటున్న లావణ్యకు వయస్సుకు తగిన సామాజిక స్పృహ వుంది. ఆడపిల్ల పెళ్ళి సమస్య, దాని తీవ్రత స్పష్టంగా తెలుసు. పెళ్ళిపై సహజమైన మధుర భావాలు కూడా ఎక్కువగానే వున్న సాధారణ ఆడపిల్ల లావణ్య.

ఈ వార్త ముందు అపనమ్మకం కలిగించింది. ఆమెకేదో వింతగానూ, గమ్మత్తుగా తోచింది. ఎక్కడో మనస్సు మూలలో అస్పష్టంగా వుండే ఓ రేఖా మాత్రపు ఊహ నిజమౌతున్నట్లనిపించింది.

ఓ పెద్ద భూస్వామి, కోటీశ్వరుడు, ఎంతో పలుకుబడి గల శేషాచలంగారి అబ్బాయి తనను చూసి మోహించడం ఏమిటి..? ఆ విషయం అతను ఇంట్లో చెప్పడం ఏమిటి.? అందుకా పెద్దలు అంగీకరించడం ఏమిటి, శేషాచలంగారే స్వయంగా వచ్చి తన తండ్రిని కలిసి అడగడం ఏమిటి ... ఇది విడ్డూరం కాక మరేమిటి?!

అప్పుడు ఉత్తరంలోని చివరి విషయం గుర్తొచ్చింది. శేషాచలంగారబ్బాయి ఇక్కడే మెడిసిన్ చదువుతున్నాడు. తనను కలవొచ్చు.

చటుక్కున టేబుల్‌పై వున్న అద్దం తీసుకొని



గబగబా తనను తాను పై నుంచి క్రింది వరకూ చూసుకుంది.

సంతృప్తిలో అసంతృప్తి ... అసంతృప్తిలో సంతృప్తి ... ఏదో బెంగ ... ఏదో దిగులు... ఏదో ఆనందం ... ఏదో సంతోషం...

ఈ ద్వంద్వ భావాలు ఆమెను అతలాకుతలం చెయ్యడం అదే మొదలు ... అప్పట్నుంచీ ప్రతి క్షణం చాలా ఎలర్ట్‌గా వుంటోంది లావణ్య. అతను ఏ క్షణానైనా రావచ్చు ... హాస్టల్ కుర్రాడొచ్చి మేడం 'మీ కోసం ఎవరో వచ్చారండి' అనొచ్చు... అప్పుడు కొంచెం చీర మార్చుకుందామన్నా, కొత్త జడ తిరిగి అల్లుకుందామన్నా, బొట్టు తిరిగి పెట్టుకుందామన్నా కుదరక పోవచ్చు. ఆయన్ని క్రింద నిలబెట్టడం ఏం బావుంటుంది.

"ఆయన"

అప్పుడే ఆయన అనేస్తోంది మనస్సు ... భావన ... ఆమె కనురెప్పలపై ఏదో బరువు ... బుగ్గల్లో వెచ్చని ఆవిరి, పెదవుల్లో అసంకల్పిత అనుకంపన...

ఇలాంటి శారీరక, మానసిక వొత్తిడుల మధ్య నాలుగు రోజులు గడిచాయి లావణ్యకు. ఐదో రోజు సాయంత్రం

"మేడం మీ కోసం ఎవరో వచ్చారండి!"

అంతే. శరీరం స్వాధీనం తప్పింది. గొంతు పూడుకు పోయింది. కుర్రాడి వంక అనేక ప్రశ్నల కళ్ళతో చూసింది.

"కుర్రాయనండి. పేరు ప్రకాష్ గారంటండి ... మెడికల్ కాలేజీలో స్టూడెంటండి..."

లేడీస్ హాస్టల్లో ఐదేళ్ళుగా పని చేస్తోన్న ఆ కుర్రాడికి ఇలాంటివి సాధారణ విషయాలు.

థ్రిల్‌తో, భయంతో ఎదురు చూస్తోన్న క్షణం ... తనను చూసి మోహించి పెద్దలతో చెప్పి రాయబారం పంపి ఉత్తరం రాయించి తనను కలవడానికి ఆయన వచ్చే ఆ క్షణం ... వచ్చేసింది.

ఆయన వచ్చేశారు. భావాలను, అలజడిని దాటి వాస్తవంలో 'ఆయన్ని కలుసుకోవాల్సి వుంది'...

గబగబా అద్దంలో ఓసారి ఆకృతిని చూసుకుంది. చకచకా మెట్లు దిగి క్రిందకొచ్చింది.

అవతలగా సముద్రపు హోరు ఆ సాయంత్రం వేళ విసురుగాను, హాయిగాను వినిపిస్తోంది. అమ్మాయిలంతా రిలాక్స్‌డ్‌గా కబుర్లు చెప్పుకుంటున్నారు. సూర్యుడు కనిపించడం లేదు గానీ లేత ఎండ అక్కడక్కడా తెల్లగా మెరుస్తోంది. మిగతా అంతా లేత ఎరుపు నీడ పరుచుకొని వుంది...

ఆ లేయెండలో ఓ కుర్రాడు ... ఓ అబ్బాయి ... ఓ యంగ్‌మాన్ ... ప్రకాష్ అట. జేబులో చేతులు పెట్టుకొని హాస్టల్ మెట్ల వైపే చూస్తున్నాడు. దూరానికి కూడా అతని ముఖంలో వింత ఆసక్తి స్పష్టంగా తెలు



స్తోంది. లావణ్య చివరి మెట్టు మీద ఆగడం ... ఇద్దరి చూపులు కలుసుకోవడం ఒకేసారి జరిగాయి.

ముందు కదిలింది ప్రకాష్ ... కుడి చేత్తో చెవిని ఓసారి అలవాటుగా తుడుచుకొని నవ్వాడు పలకరింపుగా.

ఆ నవ్వులో బిడియాన్ని పోగొట్టే స్నేహభావం వుంది.

లావణ్య కూడా వెంటనే ప్రతిగా నవ్వింది ... చిరునవ్వు ... ఆమెలోని కంగారును కనురెప్పలు చెప్పక చెబుతున్నాయి.

తడబడే అడుగులతో వెళ్ళింది ... దగ్గరగా...

ఆడపిల్ల మనసు వాంఛించే చక్కటి అవయవ సౌష్టవం, రూపురేఖలు వున్న హీమాన్ ప్రకాష్.

ప్రకాష్ కాబోయే 'ఆయన' ఆయన సామీప్యత ...

అప్రయత్నంగా కళ్ళు మూసుకుంది లావణ్య... ఓ క్షణం ఎటైనా పారిపోయి ఒంటరిగా కాసేపు మౌనంగా అలా వుండాలని వాంఛ.

అతను పలకరించాడు. "నమస్తే" చేతులు జోడించాడు. గొంతు సరళంగా మెత్తగా సోకుతోంది. "నా పేరు ప్రకాష్ ... మాది రావులపాలెం ... మీ నాన్నగారు దశరథరామయ్యగారు, మా నాన్నగారు శేషాచలంగారు స్నేహితులు..."

అబద్ధం - ఆయన మాట పాతిక ఎకరాల పెద్ద ఆసామి అయితే ఈయన రెండెకరాల సాధారణ రైతు. పరిచయం తప్ప స్నేహం లేని ఆర్థిక స్థాయీ భేదం.

"మీ నాన్నగారు మీకు లెటర్ రాసే వుండాలి ..." ఇంకా చెప్పేలా వున్నాడుగాని అది వినడం ఆమెకు అనీజీగా తోచింది. వెంటనే తల ఊపింది రాశారన్నట్లు.

నవ్వాడు చిన్నగా...

అతను నవ్వినా, నవ్వకపోయినా బుగ్గలు సొట్టలు ఎప్పుడూ అలాగే వుంటాయని లావణ్య తలెత్తకుండానే గ్రహించింది.

మౌనం...

అతనే అడిగాడు. "మీరు ఎమ్మే కదూ?"

తలూపింది.

"సబ్జెక్ట్?"

నోరు విప్పింది. "సోషియాలజీ"

ఆహా ... అన్నాడు.

అప్పుడడిగింది లావణ్య "మీరు?"

"మెడిసిన్" మీకు తెలుసు అన్నట్లు భుజాలెగరేసి నవ్వాడు. ఓసారి చెవిని తడుముకొన్నాడు. అది అతని మేనరిజం అని లావణ్య గుర్తించింది.

"థర్డ్ ఇయర్ ..."

అలా రోడ్డుపై ఆయన్ని నిలబెట్టి మాట్లాడించడం బావుండలేదని అప్పుడనుకుంది లావణ్య. ఆయన ప్రస్తుతం తన గెస్ట్ ... కనీసం కాఫీ ... కూల్ డ్రింక్...

"అలా వెళదాం..." కదులుతూ అభ్యర్థనగా అంది.

అందుకోసమే చూస్తున్నట్లు నవ్వి కదిలాడు ప్రకాష్.

ఇద్దరూ పక్కపక్కనే నడుస్తున్నారు. ఆమె వంచిన తల ఎత్తలేకపోతోంది.

అతని పాంటు మోకాలి క్రింద భాగం, బూట్లు... చూస్తోంది... అడుగులు లెక్కిస్తోంది. ఏడు దాటాయి. అరె ... పది ... అరెరె ... పధ్నాలుగు ... అమ్మో ... పాతిక ...

"టీ తాగుతారా ... కాఫీనా ... కూల్ డ్రింక్ తీసుకుంటారా?" ప్రకాష్ ప్రశ్నించగానే తలెత్తి షాపును చూసి సిగ్గుతో మళ్ళీ కళ్ళు దించుకుంది.

ఆ వెంటనే అంది "నేను హోస్ట్‌ను ... మీరు గెస్ట్ ... నేనడగాలి..."

అలా అన్న తర్వాత ఆయాసం వచ్చింది. ఆనందం హెచ్చింది.

ప్రకాష్ హాయిగా, విశాలంగా నవ్వాడు.

ఇద్దరూ కూల్‌డ్రింక్స్ తాగారు. లావణ్య డబ్బులిచ్చింది. తర్వాత ఎందుకో మాటలేం మాట్లాడాలో దొరకలేదు. "బై ... సీయూ... ఎల్లుండి ... వస్తానండి..." అన్నాడు.

ఇంకాసేపు అతనుంటే బావుండుననుకుందిగానీ తన లాగే కొత్తవల్ల మాట్లాడలేకపోతున్నాడనుకుంది.

అతను వెళ్ళాక మందగమనంతో మెల్లగా నడిచి వచ్చింది లావణ్య. అతను వెళ్ళినా ఏదో అదృశ్య రూపం తన పక్కనే వున్నట్లు, ఏవో కబుర్లు చెబుతున్నట్లు ఫీలయ్యింది. ఆ రాత్రి ఆమెకు చాలాసేపు నిద్ర పట్టలేదు. రూమ్ మేట్ తన ముఖంలో చిందులాడే శోభను పట్టేస్తుందన్న భయంతో ఓ పుస్తకం తెరచిపట్టుకుందిగాని అందులో చదవడానికి అక్షరాలేం కనిపించడం లేదు. చూడ్డానికి ఓ ఫోటో...

స్ఫురద్రూపి అయిన ప్రకాష్ ఓ చెయ్యి జేబులో వుంచి మరో చేత్తో చెవిని తడుముకుంటూ తనవంక కొంటె నవ్వుతో చూస్తున్నాడు.

ఆ రూపం కళ్ళకు కట్టినట్లే వుంది. ఆ నవ్వు గుండెల్లో ప్రవహిస్తోంది. మర్నాడు సాయంత్రం ఏడు గంటల వేళ ఫోన్ చేశాడు ప్రకాష్. ఆమె వూహించని విషయం అది. ఫోన్ ఎత్తి "హలో" అంది సంభ్రమంగా.

ప్రకాష్ ... "నేనండి. ప్రకాష్‌ను..."

లావణ్య కనురెప్పలు అప్రయత్నంగా నాలుగు సార్లు పడి లేచాయి.

"ఊ..." అంది మంద్ర స్వరంతో.

రేపు కలుద్దాం అనుకున్నాం కదా ... అలా బయటకు..."

అతని వాక్యం పూర్తిగా వినకుండానే అప్రయత్నంగా అనాలోచితంగా అనేసింది ...

"బయటకు ఎక్కడికి ... సింహాచలమా?"

ఆమె జవాబు వూహించనట్టు ఆగిపోయి తర్వాత చెప్పాడు 'ఆ ... అలాగే ... సింహాచలం వెళదాం... నాలుగు గంటలకి హాస్టల్ దగ్గరకొస్తాను...'

"అలాగే ... నేను వెయిట్ చేస్తుంటాను. "ఫోన్ పెట్టేసింది.

లావణ్యకేదో థ్రిల్‌గా వుంది. అంతకు మించి హుషారు... గంతులేద్దామన్నంత సరదాగా వుంది. అయితే ప్రకాష్ 'మీరు...' అని సంబోధిస్తున్న విషయం లావణ్యకు నచ్చలేదు ......నువ్వూ అనొచ్చుగా..." అనుకుంది గోముగా.

మర్నాడు ప్రకాష్ వచ్చే వరకూ ఓ విధమైన 'హిప్నాటిక్ ట్రాన్స్'లో తిరిగాడింది.

లావణ్య గంటకోసారి తల దువ్వింది. పూటకో రెండు పూలు మార్చింది.

చెవులకు పది రకాల రింగులు, జూకాలు మార్చింది. చీరెలు సరేసరి. అతనొచ్చే వరకూ ఏ చీరె కట్టుకోవాలో తేల్చుకోలేకపోయింది.

చివరికి ఏదో చీర కట్టుకొని రెడీ అయింది.

"ఆటోలో వెడదామా ... సిటీ బస్సెక్కుదామా?" అడిగాడు ప్రకాష్...

"మీ ఇష్టం..." మనస్ఫూర్తిగా అంది లావణ్య.

"సిటీబస్సు నా కిష్టం ... దూరం కూడా కదా..."


తలూపింది.

సిటీ బస్సులో ఓ సీటులో ఇచ్చితంగా ఇద్దరికి సరిపోయే సీటులో లావణ్య, ప్రకాష్.

ఆమె తనకు తెలియకుండానే కొంత విశాలంగా అంటే అతను తగిలినా ఫర్వాలేదు అన్నంత విశాలంగా ... తగలాలి అనుకొని కూడా కూర్చుంది.

ప్రకాష్ ఎంత సంస్కారంగా కాస్త జాగ్రత్తగా కూర్చున్నా తగలక తప్పదు.

అతని జీన్స్ ఫాంట్ తొడ భాగం ఆమె కాటన్ శారీ మడతలు దాటి లోపలికి 'టచ్' అవుతోంది. ఆమె పెద్ద పైట అతని విశాలమైన ఛాతికి దగ్గరగా భుజానికి తగిలి తగలక తగులుతోంది.



ఇక కుదుపులు లావణ్యకు ఎంతో నచ్చాయి. ప్రయాణం మధురంగా వుంది. లావణ్య ఎంతో ఫ్రీగా మాట్లాడింది. ఎన్నో కబుర్లు చెప్పాడు ప్రకాష్. అతని సంభాషణాతీరు ఇంటర్వ్యూలా వుండడం లావణ్య పసిగట్టింది. ప్రతిదాని మీద తన అభిప్రాయం చెప్పి ఆమె అభిప్రాయం అడగడం, తిరిగి దానిపై చర్చించడం అంతా ఎంతో హుందాగా, హాయిగా సాగింది. అతని ప్రతి మాటకు ఎంతో స్పందించిందామె. ప్రతి జోక్‌కు పడి పడి నవ్వింది. నవ్వుతున్నప్పుడామె మోము అతని భుజానికి దగ్గరగా వచ్చింది. తలలో పువ్వులు అతని జబ్బలకు రాసుకుంటూ సిగ్గుతో రెపరెపలాడాయి... గుడి చుట్టూ ప్రదక్షిణలు ... గుడిలో అతని పక్కనే నిలబడి నమస్కారాలు ... ఆ సాయంకాలం లావణ్య ... ఓ ప్రత్యేక పరిస్థితిలో కాబోయే భర్తగా భావిస్తున్న మగాడితో ఓ టీనేజ్ గాళ్ — ఆనందానంద కందళిత హృదయారవింద కావడం సహజాతి సహజం!

ఆ రాత్రి లావణ్య ఎన్నో భావనల వలయంలో సుడి తిరిగిపోయింది. ఆ రెండు రోజులు కలిసి తిరగడం వల్ల ప్రకాష్ 'మస్క్యులేన్ బాడీ ఎటాచ్‌మెంట్' లావణ్యను స్పందింప చేసింది ... ఆ రాతంత్రా కలలు ... అధో చేతనలోని కోర్కెల బుసలు ... "ఏ షర్ట్ వేసుకోను లావణ్యా?" "ఊ ... ఈ రెడ్ చెక్స్ మీకు బావుంటుంది ... ఆ ఆరెంజ్ స్లేవ్ కూడా ఫర్ఫెక్ట్‌గా వుంటుందండోయ్ ... అబ్బ సెంట్ ... ఈ షర్ట్ నిండా సెంట్" ... "గుండీలు పెట్టనోయ్ ..." ఇంకా నయం ... టక్ చెయ్యమన్నారు కాదు..." "ఏం చేస్తే తప్పేనిటి ... నేను జాకెట్ హుక్స్ పెట్టడం లేదూ... అలాగే నువ్వూ ..." ఒక్కసారి వొళ్ళు విరుచుకొని మరోవైపు తిరిగి పడుకుంది లావణ్య నిద్రలో ... ఆమె ముఖం దేదీప్యంగా వెలిగిపోతోంది కాంక్ష మధుర మార్దవంతో. కాని పెదవులు మాత్రం తడారిపోయి పెళుసుగా వున్నాయి.




"అమెరికా అమ్మాయిని పెళ్ళి చేసుకున్నావు కదా. నీ కాపురం ఎలా వుంది?"

"మా అమ్మకు ఇంగ్లీషు రాదు, నా భార్యకు తెలుగు రాదు. అందుకే ఎలాంటి గొడవ లేకుండా మా ఇల్లు ప్రశాంతంగా వుంది."

— పి.విమల

మర్నాడు లావణ్యకు ఫోన్ చేశాడు ప్రకాష్.

"హాయ్..." అంది కాస్త చనువుగా.

ప్రకాష్ కాస్త బెట్టుగా, హుందగా వుండడం ఆమెకు తొంభై శాతం నచ్చినా, పది శాతం నచ్చడం లేదు.

"భార్యగా స్వీకరించడానికి నిర్ణయించుకున్న పెద్ద మనిషి కాస్త కొంటెగా వుంటేనేం?"

"బొత్తిగా బుద్ధావతారం" అనుకుంది మురిపెంగా.

"హలో ఏమిటి నవ్వుకుంటున్నారు?"

"నీ గురించే..." అని రియాక్షన్ కోసం వూపిరి బిగబెట్టి వుంది.

ఎప్పటిలా నవ్వి, "ఆ నవ్వు సాయంత్రం కలిసినప్పుడు నవ్వాలి..." అన్నాడు.

గలగలగల జలజలజల ... నవ్వేసింది లావణ్య.

ఓ అబ్బాయి, అమ్మాయి ఏకాంతంలో ఎలా వుంటారో లావణ్యకు తెలియదుగాని 'క్లోజ్'గా మాత్రం వుంటారనుకుంది ... కాని ప్రకాష్ తను వూహించినట్లు లేదు.

అందుకు కారణం కాబోయే భార్యగా ఓ గొప్పింటి కోడలికుండాల్సిన హుందా, స్నేహభావం, కలుపుగోలుతనం లాంటివి వున్నాయో లేదో పరీక్షిస్తున్నాడు అనుకుంది...

ఆ ఆలోచన ఆమెకెంతో హాయినిచ్చింది. ఆమెకు గల ఆత్మ విశ్వాసం కలిగించిన హాయి అది.

ఊహించినట్లుగానే సాయంత్రం ఐదు గంటల వేళ వచ్చాడు ప్రకాష్.

హాస్టల్ కుర్రాడు చెప్పగానే హుషారుగా చెంగు చెంగున క్రిందికొచ్చింది. గుమ్మంలోనే అతన్ని చూసి నవ్వి చెయ్యి వూపింది. చురుగ్గా దగ్గర కొచ్చి ప్రకాష్ వంక చూసి నవ్వింది...

ప్రకాష్ నవ్వి పక్కకు చూశాడు ...

అప్పుడు చూసింది పక్కకు ... మరోవ్యక్తి ఆమెను పరీక్షగా మెరిసే కళ్ళతో చూస్తున్నాడు. ప్రకాష్ గొంతు ఉత్సాహంగా పలికింది.

"మీట్ మిస్టర్ సుధీర్ ... మిమ్మల్ని చూసి నచ్చి మా నాన్నగారికి చెప్పి ఒప్పించిన మీ ఆరాధకుడు ... అఫ్‌కోర్స్ నాకు బ్రదర్ ... బెంగుళూరులో ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. మొన్న సంక్రాంతి సెలవల్లో కాబోలు మిమ్మల్ని చూసింది?!... మీరిలా హాస్టల్లో వుంటారని, చూసి మాట్లాడమని నాకు లెటర్ రాశాడు. మిమ్మల్ని చేసుకోమని పట్టుపై చేస్తున్నా వదినగారూ!" నవ్వాడు.

కరెంట్ షాక్ కొట్టినట్లు కొయ్యబారిపోయింది లావణ్య. ఆమెకు సిగ్గేసింది. తర్వాత తన మీద తనకే అసహ్యం లాంటిది కూడా కలిగింది.

ఆ తర్వాత శేషావతారం తన కొడుకును చేసుకోని దానికి లావణ్య తిరస్కరించిందన్న కోపంతో దశరథ రామయ్య ఇంటిపై దాడిచేసి నానా రభస చేశాడు. *



# చర్చను ముగిస్తున్నాము

"మూడు తరాలు" నవలనూ, ఫెమినిస్టుల అభిప్రాయాలనూ విమర్శిస్తూ రంగనాయకమ్మగారు రాసిన సుదీర్ఘ వ్యాసాన్ని పది వారాలపాటు ప్రచురించిన తర్వాత స్త్రీ పురుష సంబంధాలపై చర్చను కొనసాగించవలసిందిగా పాఠకులను కోరాము. విమర్శ నడుస్తున్నప్పుడే శ్రీ ఆర్.ఎస్. సుదర్శనం, శ్రీ మహీధర రామమోహనరావు వంటి ప్రముఖులు తమ తమ అభిప్రాయాలను ప్రకటించడం తెలిసిందే. ఆ తర్వాత చర్చ కొనసాగిన ఈ ఏడెనిమిది వారాలలోనూ పలువురు పాఠకులు ఉత్సాహంతో, బాధ్యతతో పాల్గొన్నారు. వీలైన ఉత్తరాలను ప్రచురించాము. మరెన్నిటినో ప్రచురించలేకపోయాము. ప్రచురించలేని ఉత్తరాలలో అంతకు ముందు ప్రస్తావించిన అంశాలే ఎక్కువగా వుండడం వల్ల ప్రచురించలేకపోయామని మనవి.

పోతే, ప్రచురించిన ఉత్తరాలలో నేరుగా ఫెమినిస్టులను సమర్థించే వాటితోపాటు విమర్శలో రంగనాయకమ్మగారు అనుసరించిన వైఖరీ, ఉపయోగించిన మాటలూ ఆక్షేపణీయాలంటూ వచ్చినవీ వున్నాయి. అయితే, ఆమె విమర్శతో ఏకీభవిస్తూ విమర్శను అభినందిస్తూ, ఫెమినిస్టుల అభిప్రాయాలను నిరసిస్తూ వచ్చిన ఉత్తరాలే ఎక్కువగా వున్నాయని చెప్పక తప్పదు. చర్చలో పాల్గొన్న అందర్నీ అభినందిస్తూ, ఇంతటితో ముగిస్తున్నామని తెలియజేసుకుంటున్నాము.

—ఎడిటర్